

ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సస్పెన్షన్?!

డిఎంఇ నుంచి ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఆర్థోపెడిక్ విభాగానికి సంబంధించిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ చత్రపతి, డాక్టర్ మహీధర్‌రెడ్డి సస్పెన్షన్‌కు గురయ్యారు. గురువారం డిఎంఇ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రికి చెందిన ఇద్దరు పీజీ విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు సంబంధించిన ఆర్టీఫీషియల్ బయోమెట్రిక్ నమోదుపై వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. దీనిపై సర్వజనాస్పత్రి యంత్రాంగం చేపట్టిన విచారణలో వాస్తవమని తేలడంతో చర్యలు తీసుకున్నట్లు సమాచారం. దీనిపై సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లపై చర్యలు తీసుకున్న సంగతి వాస్తవమేనని, డిఎంఇ నుంచి ఉత్తర్వులు అందాయని పేర్కొనడం గమనార్హం.

'ఉపాధి'కి నీడ కరువు!

మండుటెండల్లో కూలీలు మలమల
మెడికల్ కిట్స్, తాగునీటికీ నోచని వైనం
టెంట్ల ఏర్పాటులోనూ డ్వామా వైఫల్యం

జిల్లాలోని ఉపాధి హామీ కూలీలకు నీడకరువైంది. ఈ ఏడాది ఏప్రిల్, మే మాసాల్లో 42 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్న నేపథ్యంలో కూలీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఉదయం తొమ్మిది గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్న నేపథ్యంలో డ్వామా యంత్రాంగం కనీస సదుపాయాల్ని ఏర్పాటు చేయకుండా ఉపాధి కూలీల సంరక్షణను గాలికొదిలేసింది. యుపిఎ హయాంలో వామపక్షాల చొరవ కారణంగా అమల్లోకి వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి సర్కారు దశల వారీగా నిర్వీర్యం చేసే ప్రయత్నాలను వేగవంతం చేస్తోంది. సదుపాయాల కల్పన దగ్గర నుంచి కూలీలకు పని దినాల తగ్గింపు దశల వరకు క్రమేణా నిర్వీర్యం చేస్తోంది. ఈనేపథ్యంలో ప్రజాశక్తి బృందం గురువారం ఒంటిమిట్ట మండలంలో పర్యటించింది. ఉపాధి హామీ పనుల క్షేత్ర స్థాయి పరిశీలనలో టెంట్లు, మెడికల్ కిట్స్, తాగునీటి వంటి కనీస సదుపాయాలను కల్పించడంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం విస్మయాన్ని కలిగించింది.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఉపాధి కూలీలు కనీస వసతులకు నోచుకోలేదు. ఉపాధి హామీ చట్ట నిబంధనల మేరకు పని ప్రదేశాల్లో కూలీలకు టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్స్ వంటి సదు పాయాల్ని అందుబాటులో ఉంచాలి. పదేళ్లుగా కేంద్రంలోని బిజెపి సర్కారు ఉపాధి హామీ పథకాన్ని బడ్జెట్ కేటాయింపుల దగ్గర నుంచి నిర్వీర్యం చేస్తూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్ పరిధిలోని ఉపాధి హామీ పనుల వ్యవహారాన్ని తాజాగా ఎన్ఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లోకి మార్చింది. ఉపాధి హామీ కూలీల కనీస సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం దగ్గర నుంచి టెంట్లను ఏర్పాటు చేయడంలో జాగ్రత్తలు తీసుకోకపోవడం, తాగునీటి సదుపాయాలను కల్పించకపోవడం, మెడికల్‌కిట్స్‌ను అందుబాటులో ఉంచకపోవడం, సకాలంలో వేతనాలు పడకపోవడం, పని డిమాండ్ చేసిన కూలీల పని దినాల తెగ్గోత వంటి సమస్యలను సృష్టించి నిర్వీర్యం చేస్తోందని కూలీలు వాపోతుండడం ఆందోళన కలిగిస్తోంది.

లక్ష మంది హాజరు సరే

జిల్లాలో గురువారం 1.09 లక్షల మంది ఉపాధి పనులకు హాజరయ్యారు. ఈ ఏడాదిలో అత్యధిక మంది హాజరు ఇదే కావడం గమనార్హం. జిల్లాలో 2,40,983 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 4,38,802 మంది ఉన్నారు. వీరిలో 1,95,363 మంది యాక్టివ్ కార్డు దారులు ఉన్నారు. ఇందులో 3,34,508 మంది యాక్టివ్ కూలీలు ఉన్నారు. వీరికి సంబంధించి 97,704 కుటుంబాలు ఉపా ధి పనులకు వచ్చిన జాబితాలో ఉన్నాయి. ఇందులో 1,47,048 మంది ఉపాధి పనులకు హాజరు జాబితాలో ఉన్నారు. గురువారం అత్యధికంగా లక్ష మంది హాజరుకు తగిన ఏర్పాట్లు చేయడంలో వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించడం విస్మయాన్ని కలిగించింది.

కనీస వసతులూ కరువే!

జిల్లా ఉపాధి హామీ యంత్రాంగం కూలీల సంరక్షణను గాలికి వదిలేసింది. ఒంటిమిట్ట మండలంలోని ఉపాధి హామీ పనుల ప్రదేశాలను ప్రజాశక్తి బృందం పరిశీలించింది. ఒంటిమిట్ట మండలం 13 పంచాయతీల్లోని 63 ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులకు 2,155 మంది పనులకు హాజరు తీరును, వసతులను గమనించింది. అత్యధికంగా రాచగుడిపల్లి, గంగపేరూరు, చింతరాజుపల్లి వంటి ప్రాంతాల్లో సుమారు 300 మంది వరకు హాజరయ్యారు. రాచగుడిపల్లి, ఒంటిమిట్ట పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల క్షేత్రస్థాయి పరిశీలనలో ఉపాధి హామీ నిబంధనల మేరకు ఏర్పాటు చేయాల్సిన నిబంధనలు అమలుకు నోచని వైనాన్ని గమనించింది. టెంట్లు, తాగునీరు, మెడికల్‌కిట్స్ వంటి కనీస వసతుల్లో ఏఒక్కటీ అమలుకు నోచుకోకపోవడం గమనార్హం.

సూర్యతాపం ధాటికి విలవిల

ఈ ఏడాది ఏప్రిల్, మే మాసాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించడం తెలిసిందే. జిల్లాలో రెండ్రోజుల కిందటి నుంచి 42 డిగ్రీల నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే మూడ్రో జులపాటు జాగ్రత్తగా ఉండాలనే హెచ్చరికల నేపథ్యంలోనూ ఉపాధి కూలీల ప్రాణాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవ హరించడం ఆందోళన కలిగిస్తోంది. ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ ఎగువ భాగంలోని కొండ ప్రాంతంలోని ఉపాధి కూలీల పనుల్ని పరిశీలిస్తే ఎర్రటిఎండలో ఉపనులు చేస్తున్న కూలీలకు ఎండబారి నుంచి కాపాడుకునేందుకు నీడనిచ్చే చిన్నపాటి చెట్టు కూడా లేకపోవడం గమనార్హం. మండు టెండల్లో పట్టుకున్న గడ్డపారలు, గంపలు కాలిపో తుండడంతో పట్టుకుని తవ్వలేక, ఎండవేడిమిని తాళలేక కూలీలు విలవిలలాడుతున్న దృశ్యం కనిపించింది.

తాగునీరూ కరువే!

తాను ఇంటి దగ్గర నుంచి తెచ్చుకుంటున్న బాటిల్ నీళ్లనే తాగుతున్నా. బాటిల్ నీళ్లు అయితేపోతే ఇంటికి వెళ్లే వరకు ఆగాల్సిందే. ఇక్కడ ఎటువంటి సదుపాయమూ లేదు. సమీపంలోనూ నీళ్లు దొరికే అవకాశం లేదు.

- పుల్లయ్య, ఉపాధి కూలీ, రాచగుడిపల్లి, ఒంటిమిట్ట.

టెంట్లు ఏర్పాటు చేస్తాం

ఉపాధి ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఎండ వేడిమి అధికంగా ఉంటున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని పేర్కొనడం గమనార్హం.

- శివశంకర్‌రెడ్డి, ఎపిఒ, ఒంటిమిట్ట.

టెంట్లు ఏర్పాటు చేయకపోతే ఆందోళన

ఉపాధి ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయకపోతే ఆందోళన చేపడతాం. 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం కూలీల ప్రాణాల గురించి ఆలోచించకపోవడం దారుణం.

- కె.నరసయ్య, మండల కార్యదర్శి, వ్య.కా.స, ఒంటిమిట్ట.

సర్వే రాళ్లు నాటే ప్రక్రియ పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-రాయచోటి

రీ సర్వే ప్రక్రియలో భాగంగా సర్వే రాళ్ల నాటే ప్రక్రియను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీష, డిఆర్ఒ సత్యనారాయణ, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జాతీయ రహదారుల భూసేకరణ, గృహ నిర్మాణాల స్టేజి కన్వర్షన్ ఉండేలా వేగవంతం చేయాలన్నారు. స్పందన గ్రీవెన్స్‌లను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. పర్యాటక శాఖకు చెందిన భూమి అలియనేషన్ త్వరితగతిన చేయాలన్నారు. వ్యవసాయ మరియు అనుబంధ శాఖలు మెరుగైన సేవలు ప్రజలకు అందించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అర్జీలను సకాలంలో నాణ్యతగా అర్జీదారుల సంతృప్తి మేరకు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లా అధికారులు జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తప్పనిసరిగా బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్లకుండ సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు కార్యక్రమాన్ని నిర్దేశించిన లక్ష్యాల మేరకు సకాలంలో పూర్తి చేసేలా వివిధ స్టేజిలో ఉన్న వాటిని పూర్తి చేసే దిశగా వేగవంతం చేయాలన్నారు. స్టేజి వారీగా పురోగతి ఉండాలని ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న జగనన్న భూహక్కు - భూ రక్ష రీసర్వేలో రెండవ ఫేజ్ గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, వెక్టరైజేషన్ డిఎల్ ఆర్ పబ్లిష్ చేయడం హక్కు పత్రాలు అందజేయడం వంటివి సకాలంలో పూర్తి అయ్యేలా ప్రణాళికా బద్ధంగా పని చేయాలని సూచించారు. మొదటి ఫేజ్ కింద రీ సర్వే ప్రక్రియ పూర్తి అయిన వాటికి రాళ్ళు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేసి సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. పలు అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.

బిజెపి ఎంపీ బ్రిజ్ భూషన్‌ను అరెస్టు చేయాలి : 'సిటు'



నిరసన తెలుపుతున్న క్రీడాకారులు, నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషన్‌ను వెంటనే అరెస్టు చేయాలని, తమకు న్యాయం చేయాలని దేశ రాజధానిలో ఆందోళన చేస్తున్న వారిపై మోడీ ప్రభుత్వం తీరు దేశానికి అగౌరవమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. గురువారం ప్రజా సంఘాలు జాతీయ కమిటీల పిలుపు మేరకు ప్రభుత్వ బాలుర కళాశాల వద్ద ఆట స్థలంలో వాలీబాల్, కబడ్డీ క్రీడాకారులతో కలసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేలాగా రెజ్లర్ల మహిళా క్రీడాకారులు బంగారు కాంక్ష పథకాలను ఒలంపిక్ టిక్కో ఒలంపిక్‌లో సాధిస్తుంటే వారికి అండగా నిలవాల్సిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బ్రిజ్ భూషన్ శరణ్ సింగ్ కంచె చేను మేసినట్లు కాపాడాల్సిన అధ్యక్షుడే వారే లైంగిక వేధింపులకు పాల్పడుతుంటే వారి సమస్యలను ఎవరు పరిష్కరించాలని ప్రశ్నించారు. క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపైన చర్య తీసుకోవాలని జనవరిలో ఆందోళనకు దిగితే ప్రభుత్వం కమిటీ వేసి విచారిస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలలైనా పట్టించుకోకపోవడంతో కొద్ది రోజుల కిందట ఏడు మంది మహిళా రెజ్లర్ల క్రీడాకారులు సుప్రీం కోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. కోర్టు సైతం ఇది తీవ్రమైన ఆరోపణ తక్షణమే ఢిల్లీ పోలీసులు స్పందించి చర్య తీసుకోవాలని ఆక్షేపించిందన్నారు. బిజెపి ఎంపీని కాపాడడం కోసం ఎలాంటి చర్యలు తీసుకోకుండా లైంగిక వేధింపులకు గురైన క్రీడాకారుణులపైన వారి కుటుంబ సభ్యులపైన దౌర్జన్యాలకు బెదిరింపులకు పాల్పడడం ఆర్థికంగా సహకరిస్తామని ఆశ పెట్టడం జరుగుతుందని విమర్శించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ఫయాజ్ మాట్లాడుతూ 25 రోజులుగా రాత్రి పగలు ఎండ వాన అనకుండా రెజ్లర్ల క్రీడాకారులు జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తుంటే దేశవ్యాప్తంగా మేధావులు ప్రజాసంఘాలు ముఖ్యంగా మహిళ రైతు సంఘాలు జమ్మూ కాశ్మీర్ మాజీ గవర్నర్ మాలిక్ లాంటి మేధావులు మద్దతుగా నిలుస్తున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా అవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ఎంపీలు, మంత్రులు దేశంలో రోజుకొకరు లైంగిక వేధింపులకు అత్యాచారాలకు హత్యలకు పాల్పడుతున్నా బాధితులపైన దాడులు చేసి చంపుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. లైంగిక వేధింపులకు అత్యాచారాలకు హత్యలకు దౌర్జన్యాలకు దాడులకు ప్రతీకగా బిజెపి నిలుస్తుందని విమర్శించారు. ఆందోళన చేస్తున్న రేజ్లర్లపై పాశవికంగా దాడులకు పాల్పడటం దారుణమన్నారు. తక్షణమే మోడీ ప్రభుత్వం రెజ్లర్ల ఆందోళనకు స్పందించి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ శరన్ సింగ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి డిమాండ్ చేశారు. తక్షణమే రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష పదవి నుంచి తొలగించాలన్నారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరేష్, వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి 'నల్లారి'కి లేదు

- పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రత్యక్ష రాజకీయాల్లో ఒక్కసారి కూడా గెలవలేని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించడం సిగ్గుచేటని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏలాంటి అనుమతులు లేకుండా కమీషన్ల కోసం ఆవులపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేస్తున్నారని కిషోర్ కుమార్‌రెడ్డి వ్యాఖ్యాలను ఖండించారు. మూడు ప్రాజెక్టుల ద్వారా పుంగనూరు, పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లోని ప్రజలకు, రైతులకు సాగునీరు, తాగునీరు అందించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధిని చూసి ఓర్వలేక నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కేంద్ర జలవనరుల సంఘం, జాతీయ హరిత ట్రిబునల్‌కు ఫిర్యాదు చేయడం చూస్తుంటే కిషోర్ కుమార్‌రెడ్డికి కడుపుమంటెక్కిపోయి గెలవలేమన్న భావంతో తప్పుడు ప్రచారాలు చేస్తుందన్నారు. గ్రామాల్లో రైతులకు తాగునీరు, సాగునీరు అందించాలని సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో మాట్లాడి ప్రాజెక్టులను నిర్మిస్తున్నారని, కేవలం బురద జల్లేందుకు ఆరోపణలు చేస్తున్నారని, దీనిని వైసిపి తరపున ఖండిస్తున్నామన్నారు. ఇంటింటికి నీరు అందించాలని, పల్లెలో ఇబ్బందులను గమనించి ఉన్నత స్థాయిలో ఒప్పించి మంత్రి పెద్దిరెడ్డి కృషి చేస్తు న్నారన్నారు. కిషోర్ కుమార్‌రెడ్డి ఎన్ని కుట్రలు పన్నినా 2024 ఎన్నికల్లో మళ్లీ వైసిపి విజయం తథ్యమని, ప్రజలు జగన్మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నీళ్లభాస్కర్, కేశవరెడ్డి, అబ్దుల్ కలీం, రెడ్డిశేఖర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రాయుడు, ఆనంద, షాహెద్, సైపుల్లా, జయచంద్ర పాల్గొన్నారు.

టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులను సన్మానించాలి

పాఠశాల యాజమాన్యాలకు మంత్రి బొత్స ఆదేశాలు

ప్రజాశక్తి-రాయచోటి

ఎస్ఎస్‌సి పరీక్షల్లో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులను, పాఠశాల యాజమాన్యంను సన్మానం చేసే కార్యక్రమాలను ఎంతో పగడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన సంబంధిత కార్యదర్శులు అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు ఆర్ఐఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీష, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులను, పాఠశాల యాజమాన్యంను సన్మానం చేసే కార్యక్రమాలను ఎంతో పగడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సి పరీక్షలలో ప్రభుత్వ విద్యాలయాల్లో చదివి మెరుగైన ఫలితాలు సాధించిన టాపర్ విద్యార్థులను వారి తల్లితండ్రులను, పాఠశాల యాజమాన్యంను సన్మానం చేయాలన్నారు. జిల్లా స్థాయిలో మొదటి, రెండవ, మూడవ స్థానంలో ఎస్ఎస్‌సిలో టాపర్లుగా నిలిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేయాలని పేర్కొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో చలివేంద్రం ఏర్పాటు

రాజంపేట అర్బన్: రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో సందర్శకులకు చల్లని తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి సోమవారం ప్రభుత్వ గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చే వారి దాహం తీర్చేందుకు నీటి సౌకర్యాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ గురువారం ఏర్పాటు చేశారు. ఎండలు తీవ్రమైన ప్రస్తుత రోజుల్లో కార్యాలయానికి వచ్చే పేదలకోసం సబ్ కలెక్టర్ తాగునీరు ఏర్పాటు చేయడాన్ని ప్రజలు అభినందిస్తున్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు కుండలలో చల్లని మంచినీటిని సందర్శకులు తాగుతున్నారు. నీళ్ల సీసా కొనుగోలు చేయలేని వారికి, తీవ్రమైన ఎండలో వచ్చిన వారికి ఈ ఏర్పాటు సంతోషాన్ని కలిగిస్తోంది.

ఆంగ్ల మాధ్యమానికి దరఖాస్తులు

రాయచోటి: జిల్లాలోని రాజంపే ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ఆంగ్ల మాధ్యమంలో వివిధ తరగతుల్లో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ సాధికార అధికారి కె.అబ్బలోమ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తరగతి 37, 4వ తరగతి 24, 5వ తరగతి 17, 6వ తరగతి 18, 8వ తరగతి 6, 9వ తరగతి 7 ఏదేని ఇతర వివరాలకు నేరుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులను కలవాలని లేదా 9885088024కు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

ఎపిడిఇఇ సెట్-2023 నోటిఫికేషన్ విడుదల

రాయచోటి: రాష్ట్ర వ్యాప్తంగా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు నిర్వహించే డిఇఇసెట్-2023 నోటిఫికేషన్ పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిందని డైట్ ప్రిన్సిపల్ శ్రీరామ్ పురుషోత్తం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ మే 28 వరకు కొనసాగుతుందిని తెలిపారు. జూన్ 5న హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. జూన్ 12, 13 తేదీలలో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించుచున్నారుని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 22వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించే అవగాహన తరగతులకు డైట్ కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కరీముల్లా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు మదనపల్లె మున్సిపాలిటీ 14వ వార్డులో అర్హులైన వారందరికీ అందించాలని అ వార్డు కౌన్సిలర్ షేక్ షబానా, అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా పేర్కొన్నారు. గురువారం స్థానిక 14వ వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, డ్వాక్రా మహిళలతో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్క లబ్ధిదారునికి చేరాలని సూచించారు. ఏదేని సమస్యలతో ప్రజలు వస్తే వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వార్డు ప్రజలతో స్నేహపూర్వక వాతావరనాన్ని కొనసాగిస్తూ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతోపాటు లక్ష్యాలను సాధించాలని సూచించారు.

'ఇదేం ఖర్మ'ని ప్రజలు బాధపడుతున్నారు : ఆర్ఆర్



మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

నియోజకవర్గంలో ప్రతి ఇంటిలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న అవినీతి కార్యక్రమాలతో ఇదేంకర్మ అని ప్రజలు బాధపడుతున్నారుని మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలో ప్రతి ఒక్క ఇంటి నుండి వస్తున్న సమాధానం ఈ పరిపాలన మాకొద్దు ఇదేం కర్మ మన నియోజకవర్గానికి అని వారి నోట వినిపిస్తున్న మాట ఇదే అన్నారు. రాయచోటిలో ప్రధానంగా మంచినీటి సమస్య బిందె రూ.12 పెట్టి కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు .వెలిగల్లు ద్వారా వచ్చే నీటిని ఎవరు వాడడం లేదని దానిలో పురుగులు ఉండటం వల్ల కేవలం ఒక్క గృహ అవసరాల కోసమే వాడుతున్నామని చెప్పి చాలామంది బాధపడ్డారున్నారు. ఒకపక్క డ్రైనేజీ సమస్యలు ఒకపక్క చెత్త సేకరించడంలో వైఫల్యం నియోజకవర్గంలో ఎక్కడ చూస్తే అక్కడ భూకబ్జాలు పేదవారికి ఇచ్చే రేషన్ కార్డులు పింఛన్లు ఇంటి స్థలాల కోసం భారీ ఎత్తున అవినీతి కార్యక్రమాలకు పాల్పడి లక్షలాది డబ్బు వాలంటీర్ల ద్వారా వసూలు చేయడం జరిగింది అని ప్రజలు బాధపడుతున్నారన్నారు .ప్రధానంగా భూగర్భ డ్రైనేజీ పేరుతో కొట్లాది రూపాయలు దుర్వినియోగమైందని అవసరమైన చోట ఎక్కడ కూడా భూగర్భ డ్రైనేజీలు వేయకుండా నివాసితులు లేని చోట నిర్మానుష్యమైన ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీలు క్వాలిటీ లేకుండా వేసి కోట్లాది రూపాయలు దోచుకున్నారని ప్రజలు తెలియపరచడం జరిగిందని తెలిపారు. కొన్ని వార్డులలో మొత్తం సిమెంట్ రోడ్లను ధ్వంసం చేసి కొద్దిపాటిగా డ్రైనేజ్ వేసి మిగతా డ్రైనేజీ పూర్తి చేయకుండా ఉన్నందువల్ల మురికి నీరు అంతా రోడ్లపై ప్రవహించి వార్డులన్నీ కూడా బురదమయ్యాయని ప్రజలు బాధపడి చెప్పారన్నారు గ్రామాల్లో ప్రధానంగా త్రాగునీరు సంక్షేమ పథకాల కోసం అవినీతికి పాల్పడడం రోడ్లు మురికి కాలువలు నిర్మించకపోవడం వంటి స్పష్టమైన లోపాలను ఎత్తిచూపడం జరిగిందన్నారు. మనల్ని అందర్నీ నిరుపేదలుగా చేసిన జగన్తో మన పోరాటమన్నారు. సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకం కూడా లేదని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, మండల రూరల్ అధ్యక్షులు మురికి నాటి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత గుండె పరీక్షల శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె లయన్స్ క్లబ్ అభయ ఆధ్వర్యంలో ఉచిత గుండె పరీక్షలు (2డి ఎకో పరీక్షలు) శిబిరం స్థానిక దిగువకమ్మపల్లె సెవెన్ హిల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురువారం నిర్వహించారు. నారాయణ హృదయాలయ బెంగళూరు, జాలప్ప మెడికల్ కాలేజి కోలారు వారి సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన గుండె పరీక్షలు (2 డి ఎకో పరీక్షలు) ఉచిత శిబిరం మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి అపుస్మా జిల్లా అధ్యక్షులు సెవెన్ హిల్స్ హైస్కూల్ కరెస్పాండెంట్ కె.రఘునాథ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ అభయ అధ్యక్షులు జయదేవ్ రెడ్డి, కార్యదర్శి ఎన్.సుబ్బారెడ్డి, కోశాధికారి బి.కరుణాకర్‌రెడ్డి, సర్వీసెస్ చైర్మన్ సాయి శేఖర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ సెవెన్ హిల్స్ హైస్కూల్‌లో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉచిత గుండె పరీక్షలు చేయుంచుకోవడానికి శిబిరాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయమని స్పష్టం చేశారు. పేదలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా చైతన్య పర్చడం జరిగిందన్నారు.అనంతరం లయన్స్ క్లబ్ అభయ అధ్యక్షులు జయదేవ్ రెడ్డి మరియు పలువురు సభ్యులు మాట్లాడుతూ పేద, సామాన్య ప్రజల ఆరోగ్యం విషయంలో లయన్స్ క్లబ్ అభయ ప్రాధా న్యతనిస్తూ, క్యాంపులు ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ఇలాంటి క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నారాయణ హృదయాలయ కార్డియాలజిస్ట్ డాక్టర్ కిరణ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

23న ఎపిఎస్ఎస్‌డిసి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక విశ్వహిత డిగ్రీ కళాశాలలో ఈ నెల 23వ తేదీన ఎపిఎస్-ఎస్‌డిసి (ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎపిఎస్ఎస్‌డిసి ఇఎన్‌సి భరత్ శంకర్ తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు హెచ్‌సిఎల్ టెక్నాలజీ వారు సువర్ణ అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. ఇందులో ఎంపికైన వారు రూ.10 వేలు స్టైఫండ్‌తో ఆరు నెలలు ఇంటర్న్‌షిప్‌తో ఒక్క సంవత్సరం శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ పూర్తయిన తర్వాత హెచ్‌సిఎల్‌లో పూర్తి సమయం ఉద్యోగం లభిస్తుందన్నారు. ఉన్నత విద్యను విశ్వవిద్యాలయంలో స్కాలర్‌షిప్‌తో ప్రారంభించవచ్చునన్నారు. ఎడ్యుకేషనల్ ఫీజు పాచికంగా హెచ్‌సిఎల్ చెల్లించబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లల్లో సృజనాత్మకతను ప్రోత్సహించాలి

పీలేరు: పిల్లల్లో సృజనాత్మకతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పీలేరు గ్రంథాలయ అధికారి అమర్నాథ్ తెలిపారు. గ్రంథాలయ వారో త్సవాల సందర్భంగా గురువారం పీలేరు గ్రంథాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ప్రతి ఏడాది గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో చిన్నారులకు ఈ వేసవి శిక్షణ శిబిరాలు గ్రంథాలయాల్లో ఎంతో ఉప యోగంగా ఉంటాయని అన్నారు. సాధారణంగా వేసవి సెలవులు వచ్చా యంటే పిల్లలు చదువుపై శ్రద్ధ తగ్గించుకోవడమే కాకుండా ఆట విడుపుల్లో ఆసక్తిని పెంచుకుంటారని చెప్పారు. ఈ తరుణంలో గ్రంథాలయాలు వేసవి శిక్షణ శిబిరాలతో ద్వారా వారిలో సృజనాత్మకతకు బీజం పోసి ఆసక్తిని పెంచడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 8న ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు జూన్ 11 వరకు నిర్వహిస్తామన్నారు. గ్రంథాలయంలో ప్రస్తుతం చిన్నారులకు డ్రాయింగ్, చెస్, క్యారమ్స్, సంగీతం, శాస్త్రీయ నృత్యం, కబాడీ, కథలు రాయడం, కథలు చెప్పడం వంటి అనేక అంశాల్లో ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారితో శిక్షణ ఇప్పిస్తున్నామని అమర్నాథ్ తెలిపారు. గ్రంథాలయానికి ప్రతిరోజు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుండి రాత్రి 7 గంటల వరకు పిల్లలు శిక్షణా శిబి రంలో ఆనందంగా పాల్గొంటున్నారని తెలిపారు. చిన్నారులకు స్పోకెన్ ఇంగ్లీష్ పై కూడా పట్టు సాధించాలన్న తపనతో పలువురు ప్రభుత్వ ఇంగ్లీష్ ఉపాధ్యాయులను సంప్రదించి సులభతరంగా ఇంగ్లీష్ నేర్పడం జరుగు తుందని చెప్పారు. ఈశిబిరాన్ని తల్లిదండ్రులు తమ పిల్లల కోసం సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిపిఎంఒ డాక్టర్ లోక్‌వర్ధన్

వంద శాతం లక్ష్యాలను సాధించాలి

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలలో వందశాతం లక్ష్యాలు సాధించాలని జిల్లా జాతీయ ఆరోగ్యమిషన్ పర్యవేక్షణ అధికారి (డిపిఎంఒ) డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమ అమలు పర్యవేక్షణలో భాగంగా డాక్టర్ లోకవర్ధన్ గురువారం మండలంలోని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆస్పత్రి దస్త్రాలు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై ఎన్‌సిడి, సిడి సర్వే , ఆరోగ్యశ్రీ లోని ఎఎన్‌ఎం, ఫీడ్‌బ్యాక్ వెక్టార్ కంట్రోల్ హైజీన్ ఆఫ్ ఆర్‌సిహెచ్ పోర్టల్ నిర్వహణ, అనిమియా ముక్త్ భారత్, గ్రామ పారిశుధ్య, పోషణ, జన ఆరోగ్య సమితి ఖాతాల నిర్వహణ పై సమీక్ష నిర్వహించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ, అతిసారా కేసులు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన మేరకు సెలైన్ బాటిల్స్ స్టాక్ నిల్వ ఉంచుకోవాలని ఫార్మసిస్ట్ రమణిని ఆదేశించారు. అనంతరం వార్డులో అతిసారాకు చికిత్స పొందుచున్న రోగులను పరామర్శించారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున అవసరమైతే తప్ప ఇంటిలో నుంచి బయటకు రాకూడదని సూచించారు. ప్రతి గ్రామ సచివాలయం, అంగన్వాడీకేంద్రం, వైఎస్‌ఆర్ విలేజ్ క్లినిక్‌లలో ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు సరిపడా నిల్వ ఉంచామని ఆశాకార్యకర్తలు, గ్రామ వాలంటీర్ల దగ్గర కూడా అందుబాటులో ఉంచామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గిరిధర్‌రెడ్డి,హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సిహెచ్‌ఒ భాగ్యలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో అన్ని విధాలా కృషి చేస్తానని మార్కెట్‌యార్డ్ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో పాలకమండలి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డు అభివృద్ధికి పాలక మండలి సభ్యులు సహకారం తప్పనిసరని అన్నారు. అదనపుషెడ్లు, కూరగాయలమార్కెట్ ఏర్పాటుకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళి ప్రజలకు చేరువగా మార్కెట్‌ను వినియోగించుకోవడానికి తన వంతు ప్రయత్నం చేస్తా నన్నారు. రాయలసీమ లోనే లక్కిరెడ్డిపల్లె మార్కెట్‌యార్డ్ మూడవ స్థానంలో ఉందని, రాబోయే రోజుల్లో మొదటి స్థానంలో ఉంచడానికి ప్రయత్నిస్తానని అన్నారు. మార్కెట్‌యార్డ్‌లో ఉన్న రూ.36 లక్షల నిధులతో ప్రహరీ గోడ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. పశువులసంత ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎడి జయరానీ, సరస్వతిపల్లె సింగల్ విండో ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి, రామాపురం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు అయోధ్యపురం నాగభూషణ్‌రెడ్డి, ఎంపిటిసి సూరం వెంకట సుబ్బారెడ్డి, ఎపి బిసి కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, ఇన్‌ఛార్జి మార్కెట్ కమిటీ సెక్రెటరీ మదన్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కలికిరి

రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన వాలంటీర్ పద్మకు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. వివరాల్లోకి వెళ్తే పల్లవోలు పంచాయతీ పరమటపల్లికి చెందిన వాలంటీర్ పద్మ భర్త నరేష్ రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనంలో తిరుపతికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు మార్గంలో ప్రమాదం జరిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, వైసిపి మైనార్టీ నాయకులు జుబేర్‌అహ్మద్ ఆధ్వర్యంలో బాధితురాలికి ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జునైద్‌అహ్మద్, ఇస్తియాక్ అహ్మద్, ఎంఆర్‌జి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని గారాల మడుగు పంచాయతీ దళితవాడలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రామాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు తెలిపారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎంపీ మిధున్‌రెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఆయనకు అండగా ఉంటామని పేర్కొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బంది పనితీరు మెరుగుపడాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అవుట్ సోర్సింగ్ సిబ్బంది పనితీరు మెరుగుపడాలని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. గురువారం పురపాలక కార్యాలయంలో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించి అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఒక్కో కాంట్రాక్టు ఉద్యోగికి మూడు వార్డులు కేటాయించినట్లు తెలిపారు. వారికి కేటాయించిన వార్డుల్లో ప్రతిరోజు ఉదయం 10 గంటల వరకు ఆ వార్డులకు సంబంధించిన కౌన్సిలర్లతో కలిసి పర్యటించి ఆ వార్డులో ఉన్నటువంటి పారిశుధ్య సమస్యలను, ఇతర సమస్యలను పుస్తకంలో నమోదు చేసుకుని రావాలన్నారు. అలా వస్తే ఆ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు అధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన వార్డుల్లో నేటి నుంచి పర్యటించి తమకు ఎప్పటికప్పుడు ఫోటోలు, నివేదికను అందజేయాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డిఇ ఈశ్వర్‌రెడ్డి ఎఇలను పిలిచి పాత బస్టాండ్‌లో ఉన్న మురుగు కాలువ పొంగుతూ దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. సమస్యను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ శేషఫణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రిరవి, కౌన్సిలర్లు న్యామతుల్లా, డొంక సురేష్ పాల్గొన్నారు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. గురువారం మండలం రాచవేటివారిపల్లి పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎగువమాచిరెడ్డిగారిపల్లి, సాయంత్రం దిగుమాచిరెడ్డిగారిపల్లి, గుడ్లవారిపల్లి, ఆచార్లపల్లెలో ఎంపిపి నరసింహులు, స్థానిక సర్పంచ్ సుబ్రమణ్యం, మండల ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలసి ప్రతి ఇంటిని సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో ప్రతి ఇంటికి అందిన సంక్షేమ పథకా గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు ఇళ్ల పట్టా మంజూరు చేసినప్పటికీ స్థలం చూపించలేదని, ఇంటి నిర్మాణ పనులు చేసిన బిల్లులు చెల్లించలేదని, సిసిరోడ్లు, మురికి కాలవలను వేయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఎగుమాచిరెడ్డిగారిపల్లికి అంగన్వాడీ కేంద్రం నూతన భవనాన్ని మంజూరు చేయాలని కోరారు. వాటిని వెంటనే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ లీలా మాధవి, ఆయాశాఖల ఎఇ లకు ఆదేశించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలపడమే కాకుండా, ప్రజల ఆర్థిక స్థితి గతులు మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్‌ఐ రమణారెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ మోహన్‌రెడ్డి, ఎంపిటిసి రెడ్డి వెంకటేష్, తహశీల్దార్ సిఆర్ మంజుల, సిఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, నాయకులు రవికుమార్ రెడ్డి, చంద్రారెడ్డి, చక్రపాణిరెడ్డి, నరేంద్రరెడ్డి, నాగరాజా, షావల్లి, సర్పంచులు, ఎంపిటిసిలు,అధికారులు పాల్గొన్నారు.



నిమ్మనపల్లి : ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్ బాషా

కంభంవారిపల్లి : పీలేరునియోజకవర్గం కె.వి.పల్లి మండలం గర్నిమిట్ట గ్రామ సచివాలయం మోటుపల్లివాండ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్ల మాదిగపల్లి, పోతిరెడ్డిగారిపల్లి, మోటుపల్లివాండ్లపల్లి, గోడ వాండ్ల పల్లి,ఎరికల పల్లి, దిన్నె హరిజనవాడ, పెడగంటపల్లి, గాజులపల్లి, నారేవాండ్లపల్లి, చింతల రామచంద్రారెడ్డి, కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు మరియు అధికారులతో కలసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలతో పేదల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని అన్నారు. విద్య , వైద్య, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

మామిడికి డ్రిప్ సౌకర్యం ఉపయోగకరం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మామిడి తోటలో డ్రిప్ సౌకర్యం ఉపయోగకరంగా ఉంటుందని లక్కిరెడ్డిపల్లె ఉద్యానశాఖ అధికారి నాగమణి పేర్కొన్నారు. ఉద్యానశాఖ సూక్ష్మనీటి సాగు పథకం సంచాలకులు అధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లి, రామాపురం మండలాలకు సంబందించిన రైతు భరోసా కేంద్రసిబ్బందికి అనంతపురం గ్రామంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవసరమైన ప్రతి రైతుకు డ్రిప్, స్ప్రింక్లర్ అందేలా చూడాలన్నారు. రైతులం దరూ రైతు భరోసా కేంద్రంలో దరకాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం చంద్రశేఖర్ సూక్ష్మ నీటి సాగు వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటుగా సూక్ష్మనీటి సాగు పరికరాలకై దరఖాస్తు చేసే విధానం, ప్రాథమిక తనిఖీ, పూర్తిస్థాయి తనిఖీలు చేసే విదానం, సాగు నీటి యాజమాన్య పద్ధతులపై పూర్తి స్థాయి మెళకువలు తెలిపారు. కార్య క్రమంలో లక్కిరెడ్డిపల్లి, రామాపురం రైతుభరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



బిందు సేద్యంపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ సిబ్బంది

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సృజన

ప్రజాశక్తి-నందలూరు

డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రభుత్వ విద్యాధికారిని డాక్టర్ సృజన కోరారు. గురువారం కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి చూపు తక్కువగా ఉన్న వృద్ధులకు కడప భారతి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారిని ఉచితంగా కడపకు తీసుకొని వెళ్లి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. ఆపరేషన్ అయిన తర్వాత పొగాకు నమలటం, పొగ తాగకుండా ఉండటం, మద్యం సేవించకుండా ఉండటం చాలా ముఖ్యమని తెలిపారు. ఆకుకూరలు, పండ్లని తీసుకోవాలని సూచించారు. ఆపరేషన్ అయిన తర్వాత కంటి మందులు డాక్టర్లు సూచన మేరకు వేసుకోవాలన్నారు. ఆపరేషన్ తర్వాత కన్ను ఎర్రబారడము, కన్ను పొడిబారడము, కను నొప్పి ఉండటం ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి గారు, సిహెచ్‌ఒ వెంకట నారాయణ, ఆప్తాలమిక్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ హిమశంకరి, ఎంఎల్‌హెచ్‌పి ఆరిఫ్,హాజీర, నిరోషా, ఎఎన్‌ఎం అంజనమ్మ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి చేరికలు

- కండువా కప్పి ఆహ్వానించిన నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ఎన్నికల వాతావరణం మొదలౌతుండడంతో ప్రధాన రాజకీయ పార్టీల్లోని ముఖ్య నాయకులతో పాటు, ద్వితీయ శ్రేణి నాయకులు సైతం తమ అనుచరులతో కలిసి తమకు నచ్చిన రాజకీయ పార్టీల్లోకి వలసలు మొదలు పట్టారు. ఎన్నికల ముందు, ఆ తర్వాత రాజకీయ ఒత్తిళ్లకో లేక తమ అవసరాలు తీర్చుకోడానికో పార్టీలు ఫిరాయించిన నాయకులే కాకుండా, ప్రస్తుతం 2024 సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రధాన నాయకులే కాకుండా ద్వితీయ శ్రేణి నాయకులు కూడా రాజకీయంగా తమ ఉనికిని కాపాడుకునేందుకో, లేక తమ రాజకీయ భవిష్యత్తును మెరుగు పరచుకోడానికో వలస బాటలు పట్టారు. ఈ వలసలు క్షేత్రస్థాయిలోని నాయకుల్లో కూడా మొదలయ్యాయి. గురువారం మండలం, జాండ్ల గ్రామం నుంచి ప్రముఖ వైసిపి నాయకులు, కార్యకర్తలు కొందరు టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ద్వారా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జాండ్ల గ్రామానికి చెందిన వైసిపి నాయకులు బాబ్జిరెడ్డి, అనీల్ కుమార్‌రెడ్డి, సిద్దారెడ్డి పలువురు ప్రముఖులతోపాటు రవి నాయక్, దేవేంద్రలు కూడా వైసిపి నాయకులు కార్య కర్తలను తెలుగుదేశంపార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని కట్టలేని వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు అసహ్యించు కుంటున్నారని అన్నారు. మూడు రాజధానుల పేరుతో కాలం వెళ్లదీస్తున్న జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి వైపు కన్నెత్తి కూడా చూసే పరిస్థితి లేదని విమర్శించారు. తెలుగుదేశం పార్టీలోకి చేరిన కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, అన్నివిధాలా అందరికీ అండగా ఉంటానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ప్రముఖ నాయకులు కోటపల్లి బాబురెడ్డి, వి. శ్రీకాంత్ రెడ్డి, రెడ్డి బాష, పురం రామమూర్తి, ఎస్. అమరనాథ రెడ్డి, డి.సురేష్ కుమార్ రెడ్డి, పసుపులేటి లక్ష్మీకర, వై.రెడ్డెప్ప రెడ్డి, పురం రెడ్డెమ్మ, కె. శ్రీనాథ రెడ్డి, షౌఖత్, పి. సురేంద్ర, వి. రాజా, స్పోర్ట్స్ మల్లి,పురుషోత్తం రెడ్డి, సామియానా జయచంద్రా, అప్పస్వామి, సురేష్ నాయక్, సురేంద్ర, హనీఫ్, షరీఫ్, అబ్దుల్లా, సురేష్, సందీప్, కాంతమ్మ, బొజ్జి రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వైసిపి నాయకులతో కిషోర్ కుమార్ రెడ్డి



పాఠశాలకు చేరిన పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఇఒ

పాఠ్యపుస్తకాల పంపిణీకి సర్వం సిద్ధం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఎంఇఒ మనోహర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతుల వారీగా, సబ్జెక్ట్ వారీగా పాఠ్యపుస్తకాలు సమకూర్చినట్లు తెలిపారు. జగనన్న విద్యా కానుకలో భాగంగా 4007 మంది విద్యార్థులకు మూడు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు మండలానికి చేరుకున్నాయని తెలిపారు. 19న స్కూల్ బ్యాగ్స్ రానున్నాయని, మిగిలిన సామగ్రి కూడా వారం రోజుల్లో స్కూళ్లకు చేరుస్తామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు తెరిచిన మొదటిరోజే విద్యా కానుక కిట్స్ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కన్నీటి నడుమ జవాన్ అంత్యక్రియలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

కన్నీటి పర్యంతం నడుమ ఆర్మీ జవాన్ దేవేంద్ర(25) అంత్యక్రియలు గురువారం స్వగ్రామమైన సోమలవాండ్లపల్లిలో జరిగాయి. మండలంలోని మద్దిరేవుల గ్రామం సోమలవాండ్ల పల్లెకు చెందిన ఆర్మీ జావాన్ సోమల దేవేంద్ర (25) భౌతిక కాయానికి గురువారం ఎంపిపి సుదర్శన్ రెడ్డి, రామాపురం ఎపిఒ మద్దిరేవుల సురేంద్ర నాథ్‌రెడ్డిలు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పీలేరు అత్తగారింటి వద్ద మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న ఆర్మీ జవాన్ దేవేంద్ర భౌతికయం బుధవారం స్వగ్రామమైన సోమలవాండ్లపల్లెకు చేరుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దేవేంద్ర భౌతికకాయం వద్ద తల్లిదండ్రులు, సోదరులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దేవేంద్ర భార్య ఎనిమిది నెలలు గర్భిణి కావడంతో చూసిన చలించిపోయారు. ఉపసర్పంచ్ సంజీవరెడ్డి, వెంకటరామిరెడ్డి, చిన్న వెంకటరమణ, రమణయ్యలు దేవేంద్ర కుమార్ భౌతికయానికి నివాళులర్పించారు.

ఎస్‌సి, ఎస్‌టి చట్టాలు నిర్వీర్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎస్‌సి, ఎస్‌టి ఓట్లను అడ్డుంపెట్టుకుని అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం దళితులకు రక్షణ కల్పించకుండా వారికోసం ఏర్పాటైన చట్టాలను నిర్వీర్యం చేస్తోందని కడప పార్లమెంటరీ టిడిపి ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి నాసారి లక్ష్మినరసింహ పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలతో స్వర్ణయుగంలా సాగితే, నేడు కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా యివ్వకుండా దళిత ద్రోహానికి పాల్పడుతున్నారని వాపోయారు. పైగా దళిత శాసనసభ్యులను, మంత్రులనూ ప్యాలెస్ గేటు బయటే నిలబెట్టి అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులో దళిత యువతులు రమ్య,స్నేహలత ,పులివెందులలో నాగమ్మ, మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్, ఇసుక అక్రమాలపై పోరాడినందుకు వరప్రసాద్, మాస్క్ వేసుకోలేదని కిరణ్, అవినీతిని ప్రశ్నించినందుకు డాక్టర్ అనితారాణి, జె-బ్రాండ్ లిక్కర్ గురించి మాట్లాడినందుకు ఓమ్ ప్రతాప్‌లను అతి కిరాతకంగా హత్యలు, అత్యాచారాలు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను దారుణంగా చంపి డోర్ డెలివరి చేసిన ఎమ్మెల్సీ అనంతబాబుకు పాలభిషేకాలు చేసి ఊరేగించడం, దారుణమన్నారు. అడిగిన దళితుల భూములు లాక్కోవడమేగాక రివర్సులో మనపైనే ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసులు పెడుతూ దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.హనుమంతునాయక్, కడప పార్లమెంటరీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మలిగేలి మల్లికార్జున, కడప పార్లమెంటరీ తెలుగుదేశంపార్టీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు గోమేధికమ్ సుదర్శన్, ఎస్సీ నాయకులు జి.విమల్ కుమార్, పల్లె మెషెక్, ఎం.వి. సురేష్ పాల్గొన్నారు.



నిమ్మనపల్లెకు చేరిన వేరుశనగ విత్తన కాయలు

మండలానికి చేరుతున్న వేరుశనగ విత్తన కాయలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేయటానికి అవసరమైన వేరుశనగ విత్తన కాయలు మండలానికి చేరుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ ఆధారంగా రైతులు వేరుశనగ పంటను సాగు చేస్తారని అన్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 2500 ఎకరాలను రైతులు సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు గుర్తించామని అన్నారు. అందుకు అవసరమైన వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం సిద్ధం చేస్తోందని తెలిపారు. ప్రస్తుతం మండలానికి (తెల్ల రకం) కే6-819 క్వింటాలు, (ఎర్రరకం) నారాయణి -796 క్వింటాలు, మొత్తం 1615 క్వింటాల వేరుశనగ కాయలను, కందులు-6 క్వింటాలు, రాగి-6 క్వింటాలు, ఆకు విత్తనాలు (జిలుగు, జనము)-30 క్వింటాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. త్వరలోనే వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేస్తామని తెలిపారు.



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న సిబ్బంది

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన మూడు ఇళ్లను అధికారులు జెసిబి సాయంతో తొలగించారు. పీలేరు-మదనపల్లి మార్గంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాలనీలో సర్వే నెంబర్:213, 214 కొందరు వ్యక్తులు రోడ్లు భవనాల శాఖ స్థలంలో ఇంటి నిర్మాణాలు చేసుకుని నివాసమున్నారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి, ఆది ఆర్‌అండ్‌బి స్థలంగా గుర్తించి, అందులోని అక్రమ నిర్మాణాలను తొలగించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి డిఇఇ చంద్రశేఖర్, ఆర్‌ఐ రాజశేఖర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీనిధి రికవరీ వేగవంతం చేయండి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలో వెలుగు సంఘ సభ్యులు స్త్రీనిధి ద్వారా తీసుకుని రుణాన్ని రికవరీ వేగవం తం చేయాలని మేనేజర్ అమరావతి పేర్కొన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సంఘ మిత్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ లోకోస్ యాప్‌ను గురించి వివరించారు. సంఘ సభ్యులు తీసుకొన్న రుణాలు సకాలంలో చెలించినట్లయితే వారు అధిక మొత్తంలో మరల రుణాలు తీసు కోవచ్చని అన్నారు. కార్యక్రమంలో సిసిలు శారద, ఆదిలక్ష్మి, సంఘ మిత్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్త్రీనిధి మేనేజర్

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలో జరిగింది. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలావున్నాయి. సంబేపల్లి మండలం గుట్టపల్లి పంచాయతీ గుదియవాండ్లపల్లికు చెందిన చామంతుల ఈశ్వరయ్య తన మోటార్‌సైకిల్‌లో తన కుమారుడు పీలేరులోని ఎంజిఆర్ కళాశాల నందు చదువుతుండగా ఫీజుకట్టి, తిరిగి ప్రయాణంలో ఇంటికి వస్తుండగా కలకడ ఇందిరమ్మ కాలనీ వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న బొలోరో వాహనం ఈశ్వరయ్య ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఈశ్వరయ్యకు తలకు తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్ లో పీలేరుకు తరలించినట్లు తెలిపారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తీసుకొని వెళ్ళినట్లు తెలిపారు. ఈశ్వరయ్య ప్రమాదానికి గురిచేసిన రాయచోటికి చెందిన ముని చంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్‌ఐ మోసస్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : ఒకరు మృతి

- ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-నందలూరు

అమ్మవారి దర్శనానికి వెళుతూ డ్రైవర్ నిర్లక్ష్యంతో ట్రాక్టర్ బోల్తా పడటంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 12 మంది గాయాలతో చికిత్స పొందుతున్న సంఘటన నందలూరులో జరి గింది. వివరాల్లోకి వెళితే.. పెనగ లూరు మండలం, నరసింగాపురం పంచాయతీ పల్లంపాడు గ్రామం నుంచి సోమశిల ముంపు గ్రామమైన కోనాపురం దగ్గర ఉన్న ముసలి పీతమ్మ గుడికి 20 మంది వెళుతుండగా ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా 12 మంది గాయపడ్డారు. గాయ పడిన వారిని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మంద బలరామయ్య (65) అనే వృద్ధుడు మృతి చెందగా మంద రాములమ్మ, లక్ష్మయ్య, పరిస్థితి విష మంగా ఉండడంతో తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. మరో 12 మందికి గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చెన్నకేశవులు, ఎఎస్‌ఐ శంకర్‌నాయక్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతి చెందిన బలరామయ్య

బాలికల అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అక్కచెల్లెలు అదృశ్యంపై గురువారం వాల్మీకిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు.. మండలంలోని ఓబులంపల్లికి చెందిన నీరజ (19) స్థానిక ఎన్‌టిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమె చెల్లెలు సంగీత (17) మదనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఇరువురుకి తల్లిదండ్రులు లేకపోవడంతో నానమ్మ లక్ష్మిదేవమ్మ ఇంట్లో ఉంటూ చదువుకుంటున్నారు. వేసవి సెలవులు కావడంతో ఇంటి దగ్గరే ఉంటూ గురువారం ఉదయం వాల్మీకిపురంకు వచ్చి కనిపించకుండా వెళ్లిపోయారని బాధితులు వాల్మీకిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎఎస్‌ఐ లీలావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.